క్లుప్తంగా

జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ద్వితీయ స్థానంలో శర్వాన్



బహుమతి అందుకుంటున్న శర్వాన్

మునగాల : కోదాడ పట్టణంలో నిర్వహించిన మేకల అభినవ్ స్మారక అండర్ టెన్ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో మునగాల మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి లింగయ్య -నాగేంద్ర కుమారుడు జిల్లేపల్లి శర్వాన్ ద్వితీయ బహుమతి సాధించాడు. గురువారం నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా శర్వాన్‌ను కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : కోదాడలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేకల అభినవ్ మెమోరియల్ చెస్ టోర్నమెంట్‌లో గ్రీన్ ఉడ్ పాఠశాల విద్యార్థులు బహుమతులు పొందినట్లు ఆ పాఠశాల యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి 48 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారని వారిలో అండర్-7 విభాగంలో జైస్వర్ణ్ మొదటి బహుమతి, అండర్- 15 విభాగంలో విశ్వ రెండవ బహుమతి సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న తోటి ఉపాధ్యాయులు

గరిడేపల్లి : భాషా పండితుడి నుంచి స్కూల్ అసిస్టెంటుగా పదోన్నతి పొంది పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ముత్తినేని కోటేశ్వరరావును గురువారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తినేని కోటేశ్వరరావు, కోశాధికారి చిట్యాల ప్రదీప్‌కుమార్, రాచకొండ ప్రభాకర్, శ్రీనివాస్, రమాదేవి, లింగయ్య, సైదులు, సత్యనారాయణ, చంద్రశేఖర్, బాలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

7న మాదిగ దండోరా రజతోత్సవం

మేళ్లచెరువు : హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జూలై 7న నిర్వహించబోయే మాదిగ దండోరా రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రజతోత్సవ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విజయభాస్కర్ మాదిగ, ఉపేందర్, సంపత్, నాగరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన పంచాయతీ కార్మికులకు పరామర్శ



గాయపడిన కార్మికులను పరామర్శిస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : పెండింగ్ వేతనాలు చెల్లించాలని సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట జూన్ 26న గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన ధర్నాకు వెళ్తున్న గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులు వేముల నాగరాజు, పల్ల బాలకృష్ణలు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గురువారం పొనుగోడులో వారిని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ ఎస్కే యాకూబ్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు యాకూబ్, గోపగాని సత్యనారాయణ, బొడ్డు వీరబాబు, అనుముల ఆరీఫ్, బంటు సైదులు, మద్దెమడుగు వెంకటయ్య, వీరబాబు, సతీష్, వీరప్రసాద్, చిన్న చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

మిర్యాలగూడ: రైతులు.. విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ పోరెడ్డి నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు లైసెన్స్ కలిగిన విత్తనాల దుకాణాదారుల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. బీటీ 3 పత్తి విత్తనాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఆ విత్తనాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- 15 నర్సరీల్లో 1.36 లక్షల మొక్కలు
- పదవ విడత హరితహారం కార్యక్రమంలో నాటేందుకు సిద్ధమవుతున్న అధికారులు



సిరిపురంలోని నర్సరీలో ఏపుగా పెరుగుతున్న మొక్కలు

నడిగూడెం : పదవ విడత హరితహారం కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళిక వేస్తున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద గ్రామల్లోని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. నర్సరీల్లో ఏపుగా పెరుగుతున్న మొక్కలను మండల పరిషత్ అధికారి, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించేందుకు వన సేవకుడిని నియమించారు.

15 గ్రామాల్లో నర్సరీలు..

నడిగూడెం మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఎర్ర మట్టి, నల్లమట్టి, పశువుల ఎరువులను ఉపయోగించి మొక్కలు పెంచుతున్నారు. నీటి సౌకర్యం సరిగా ఉన్న చోటే నర్సరీలు నిర్వహిస్తున్నారు.

మొక్కలు ఇవీ..

హరితహారం కార్యక్రమంలో భాగంగా రహదారులు, కాల్వకట్టలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ స్థలాలతో పాటు ప్రతి ఇంట్లో నాటేందుకు పండ్ల మొక్కలతో పాటు, అటవీ, పూలు, ఔషధ మొక్కలైన మామిడి, జామ, దానిమ్మ, సీతాఫలం, కర్జూర, రేగు, ఉసిరి, నేరేడు, చింత, బహుమియా, గుల్మహరా, కానుగ, దిర్శిం, శ్రీగంధం, మందార, గులాబీ, అడవి తంగేడు, గన్నేరు, తులసి, కాగితంపూలు, పారిజాతం, రణపాల, తెల్లేరు, రేల, కుంకుడు, మారేడు, వెలక ఇంకా పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. మొత్తం 1.36 లక్షల మొక్కలను పెంచుతున్నారు.

వనసేవకులకు ఉపాధి

మండల పరిధిలోని 15 గ్రామాల్లో నర్సరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 15 మంది వనసేవకులను నియమించి ఉపాధి కల్పిస్తున్నారు. వన సేవకులకు రోజుకు రెండు వందల రూపాయలు చెల్లిస్తున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం



హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1.36 లక్షల మొక్కలు పెంచుతున్నాం. ఉన్నతాధికారులతో పాటు ఉపాధి హామీ సిబ్బంది నర్సరీలను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

– ఎస్‌డి.ఇమామ్, ఎంపీడీఓ

అనుమతులు లేని సంస్థలపై చర్యలు తీసుకోవాలి



అగ్నిమాపక శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

హుజూర్‌నగర్ : అగ్నిమాపక శాఖ అనుమతులు లేకుండా నడుస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నవీన్ కోరారు. ఈమేరకు గురువారం హుజూర్‌నగర్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరామ్‌రెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూల్స్, కాలేజీలు, ప్రైవేట్ హాస్పిటళ్లు, హోటల్లో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని వాటి అనుమతులు రద్దు చేయాలని కోరారు. ఫైర్ పర్మిషన్ లేకుండా నడుస్తున్న ఆయా సంస్థలలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని, ప్రజల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి మీసాల వీరబాబు, జిల్లా కమిటీ సభ్యుడు గోబ్బి అబ్బురాం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డుకు ఆనుకొని ఉన్న సామగ్రిని తీయిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్

కోదాడరూరల్ : చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ హెచ్చరించారు. కోదాడ పట్టణంలో రోడ్డుకు ఆనుకొని తోపుడు బండ్లు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంపై సాక్షి పత్రికలో మంగళవారం 'రోడ్లపైకి షాపులు.. ట్రాఫిక్ ఇక్కట్లు' అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో గురువారం ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ స్పందించి రంగంలోకి దిగారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న వ్యాపార సామగ్రిని దుకాణాల్లో పెట్టించారు. మరోసారి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కనుల పండువగా శ్రీవారి శోభాయాత్ర



హుజూర్‌నగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి, అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న పూజారులు

హుజూర్‌నగర్ : పట్టణ శివారులోని శ్రీగోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం స్వామివారి శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర్యప్రభ, గరుడ, చంద్రప్రభ, కల్పవృక్ష, సింహ, గజ, శేష హంస తదితర వాహనాలపై శ్రీవారు, అమ్మవార్లు, ఆల్వార్లను ఉంచి నగర వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో విశేష అభిషేకాలు, చక్రస్నానం, తీర్థప్రసాద వితరణ గావించారు. సాయంత్రం ఆలయంలో సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పుష్పయాగం అనంతరం స్వామి, అమ్మవార్ల పవళింపు సేవను పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక వర్గ సభ్యులు నారాయణరెడ్డి, వెంకటనారాయణగౌడ్, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో నేలసారం



సిరిపురం రైతు వేదిక వద్ద ఘన జీవామృతం తయారీని వివరిస్తున్న వెంకటరెడ్డి

నడిగూడెం : ఘన జీవామృతంతో నేలసారం పెరుగుతుందని నారాయణపురంనకు చెందిన అభ్యుదయ రైతు నాగిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సిరిపురం రైతు వేదికలో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులకు నాబార్డు ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక ఎకరానికి ఆఖరి దమ్ములో ఆవు పేడ, ఆవు మూత్రం, బెల్లం, పప్పుల పిండి, పిడికెడు పుట్ట మట్టితో తయారు చేసిన ఘన జీవామృతం వేస్తే నేలలో బలం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. నాణ్యమైన పంట దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతులు పంట రుణాల వడ్డీ చెల్లించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులు ఏడాదిలోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈఓ చీకూరి లింగయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏడాదిలోపు వడ్డీ చెల్లిస్తే 7 శాతం మాత్రమే ఉంటుందని, అదే ఏడాది దాటిన తరువాత అయితే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి రుణాలను రెన్యూవల్ చేయించుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



గ్రామ సభలో మాట్లాడుతున్న సీనియర్ హెల్త్ అసిస్టెంట్ ఆదిలక్ష్మి

మఠంపల్లి : వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండడం అవసరమని పెదవీడు పల్లెదవాఖానా ఇన్‌చార్జ్, సీనియర్ హెల్త్ అసిస్టెంట్ ఆదిలక్ష్మి అన్నారు. గురువారం మఠంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామ సభలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించి మాట్లాడారు. గుంతల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, బిల్ కలెక్టర్ నాగేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు లింగమ్మ, భవాని, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ట్రాన్స్‌కో డీఈగా ఏ.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల పట్టణంలో ట్రాన్స్‌కో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. అయితే ఇక్కడ పనిచేసిన ఐతగాని వెంకటేశ్వర్లు మార్చిలో బదిలీ కావడంతో ఎస్.వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి డీఈగా వ్యవహరిస్తున్నారు. కాగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీఈ శ్రీనివాస్‌కు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్మికుల హక్కులను కాలరాస్తే సహించం



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల : జూలై 10న కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రాల్లోని శ్రామిక వాడల్లో నిర్వహించబోయే ధర్నాల్లో వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని అరిబండి భవనంలో జరిగిన హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నాలుగు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీఐటీయూ నేత అనంత ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, ఎలుక సోమయ్య, ఎస్‌కే.యాకూబ్, వరలక్ష్మి, సైదులు, రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమం



మఠంపల్లిలో మాట్లాడుతున్న సయ్యద్‌రన్‌మియా

మఠంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆపేది లేదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా అన్నారు. గురువారం మఠంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్మికుల యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి అంజయ్య, ఉపాధ్యక్షుడిగా మామిడి తిరుపతయ్య, కార్యదర్శిగా మంగళపల్లి మధు, సభ్యులు సుదర్శన్, మైసయ్య, గురువారెడ్డి, దేవదానం, నాగయ్య, శ్రీను, రాకేష్, చిన్నపురెడ్డి, రాములు, ప్రవళిక, సీత, జోసు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మునగాల : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 30, జూలై ఒకటవ తేదీల్లో కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించబోయే జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు కోరారు. గురువారం మునగాల మండల కేంద్రంలో శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శిక్షణ తరగతుల్లో కార్యకర్తలు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, శ్రీను, పరుశరాములు, చిరంజీవి, బాలాజీ, నాగార్జున పాల్గొన్నారు.

● పైరు పచ్చగా..



గత కొద్ది రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో చిలుకూరు మండలంలో రైతులు అపరాలైన పెసర, కందుల సాగుతో పాటు పచ్చిరొట్ట కోసం పొలాల్లో జీలుగ విత్తనాలు చల్లారు. దీంతో ప్రస్తుతం అక్కడక్కడ పెసర, కంది చేలు కళకళలాడుతున్నాయి. వానాకాలం సీజన్ సాగు చేసేందుకు ఇంకా 40 రోజుల సమయం ఉండడంతో ఈలోగా పెసర్ల పంట చేతికొస్తుందని రైతులు అంటున్నారు. మండలంలో 64 ఎకరాల్లో రైతులు పెసర పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. – చిలుకూరు

పేదల సొంతింటి కల నెరవేర్చాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : రాష్ట్రంలో ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దూళిపాల ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1400 మంది అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో నేటికీ ఎక్కడపడితే అక్కడ గుడిసెలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. పోడు భూముల రైతులకు పట్టాలు ఇచ్చి వారికి రైతు బంధు అందేలా చూడాలన్నారు. కౌలు రైతులకు ఇస్తున్న అన్ని రకాల రాయితీలను దేవాలయాల భూములు కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు వెంకట్, మహిళా సమాఖ్య నాయకురాలు నూతనగంటి నర్సమ్మ తదితరులు ఉన్నారు.

స్థలం అప్పగించాలనే నిర్ణయంపై పునరాలోచన చేయాలి



టీజీ జెన్‌కో ఎస్‌ఈ దేశ్యాకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

హుజూర్‌నగర్ : రామగుండంలో చేపట్టనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం టీజీ జెన్‌కోకు సంబంధించిన స్థలాన్ని సింగరేణి సంస్థకు అప్పగించాలనే నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరుతూ పులిచింతలలోని టీజీ జెన్‌కో విద్యుత్ జేఏసీ నాయకులు గురువారం ఎస్‌ఈ దేశ్యాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ఉత్పాదన అనేది టీజీ జెన్‌కోకు సంబంధించిన అంశమని తెలిపారు. అందుకు కావాల్సిన స్థలం, మౌలిక సదుపాయాలు రామగుండంలోని టీజీ జెన్‌కో దగ్గర ఉన్నాయని చెప్పారు. ఇతర విద్యుత్ ఉత్పత్తి కంపెనీలతో పోల్చి చూస్తే అన్నిటికన్నా తక్కువ ఖర్చులో జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని, కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీజీ జెన్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు.

కంప వేశారు.. మరమ్మతులు మరిచారు



రామాపురం సమీపంలో కాల్వ కట్టకు పడిన బుంగపై కంప వేసిన అధికారులు

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం సమీపంలో గల సాగర్ ఎడమ కాల్వ కట్టకు ఇటీవల బుంగ పడింది. నీటి పారుదల శాఖ అధికారులు బుంగను పరిశీలించారు. కానీ దానిని పూడ్చకుండా తాత్కాలికంగా కంపను అడ్డుగా పెట్టారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. సాగర్ నీరు విడుదల చేస్తే కట్టకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కట్టకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'ప్రైవేట్'లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ కోరారు. గురువారం దామరచర్లకు వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతోపాటు నోట్ పుస్తకాలు, టై బెల్ట్ పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్, బీసీ నాయకులు సందాల శంభయ్యమాదిగ, ఎర్రమాద కుమార్, కంభంపాటి నాగరాజు, శ్రీకాంత్, బాలు, సైదారాజు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



బ్యాంకు సేవలను వివరిస్తున్న అధికారులు

మేళ్లచెరువు : సహకార బ్యాంకు సేవలు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక బ్రాంచ్ మేనేజర్ షేక్ మహిమూద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బ్యాంకు సేవలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహకార కేంద్ర బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలతో పాటు గోల్డ్ లోన్, ఫిక్స్‌డ్ డిపాజిట్లకు గాను లాకర్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అబ్దుల్‌రఫీ, సతీష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

హుజూర్‌నగర్ : ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని హుజూర్‌నగర్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో వ్యాపారులకు ప్లాస్టిక్ నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దని ఆయన తెలిపారు. దుకాణాల్లో కవర్లు వినియోగించవద్దని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా తో పాటు వ్యాపార లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పలువురు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.